క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

అనంతరం యథావిధిగా స్పందన



కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. ప్రజలు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884-2357800 నెంబర్‌కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10:30 నుంచి స్పందన యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

దేశ రక్షణలో సాయుధ దళాల కృషి అభినందనీయం

కాకినాడ రూరల్: దేశ రక్షణకు సాయుధ దళాల సేవలు అభినందనీయమని అనకాపల్లి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గింజాల గంగరాజు పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నేల తల్లికి నమస్కారం – వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా మాజీ సైనిక ఉద్యోగులను జీవీఎస్ఎన్ మూర్తి, ఎస్.శ్రీనగేష్, ఎస్.రామారావు, డీకే వరప్రసాద్‌లను ఆదివారం ఘనంగా సత్కరించారు. అడబాల రత్నప్రసాద్, న్యాయవాది యనమల రామం, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

వెయ్యి మొక్కలు నాటడమే లక్ష్యం



ఆర్ఆర్ నగర్‌లో మొక్కలు నాటుతున్న లయన్స్ ఎలైట్ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: లయన్స్ ఎలైట్‌క్లబ్ ఆధ్వర్యంలో వెయ్యి మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని లయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్ఆర్ నగర్‌లో వంద మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణతో మానవాళికి బహుళ ప్రయోజనం చేకూర్చే మొక్కలు పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. క్లబ్ అధ్యక్షులు నక్కా సుబ్రహ్మణ్యం, కార్యదర్శి కిశోర్‌కుమార్, కోశాధికారి రాఘవ రావు, సభ్యులు కుర్రెళ్ల సూర్యనారాయణ, మాండలిక శాస్త్రి, రమా సుందరి, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ



బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందజేస్తున్న హెల్పింగ్ వింగ్స్ ప్రతినిధి

కరప: గ్రామ శివారు రామకంచిరాజునగర్ కాలనీ నివాసి అనసూరి భగవాన్ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో బ్రెయిన్ ఆపరేషన్ చేయించుకుని ఇంటివద్దనే ఉంటున్నాడు. తర్వాత కాలు, చెయ్యి లాగేయడంతో మళ్లీ ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నాడు. బాధిత కటుంబ ఆర్థిక పరిస్థితిని కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ద్వారా తెలుసుకున్న హెల్పింగ్ వింగ్స్ ప్రతినిధి అన్నవరం స్పందించి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దాపురం: ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్టు ఐసిడిఎస్ సీడీపీఓ ఉష తెలిపారు. ఆదివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేస్తూ ఆయా పోస్టుకు సంబంధించి ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. సామర్లకోట మండలం మేడపాడు గ్రామం (ఓసీ) కేటగిరి అభ్యర్థి ఈ పోస్టుకు అర్హులన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులై, 35 ఏళ్ల లోపు వయసు గలవారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు


పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసిన రామలింగేశ్వరస్వామికి ఆదివారం అష్టోత్తర నారికేళ జలాభిషేకం చేసినట్టు ఆలయ అర్చకుడు వీరబాబు దత్తులు తెలిపారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామివారికి మహన్యాస పారాయణం చేసి పంచామృతాభిషేకం, శత నారికేళ అర్చన నిర్వహించామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మహిళాభ్యుదయమే లక్ష్యంగా..

- చేయూతనిచ్చిన పైండా వారి విడోస్ హోం
- స్వావలంబనకు శిక్షణ ఇచ్చిన నెలవు
- కుట్టు శిక్షణ ఇచ్చి ఉపాధి చూపుతున్న నిర్వాహకులు
- దాతల ఆశయాన్ని కొనసాగిస్తున్న దేవదాయ శాఖ



విడోస్ హోంలో ఉచిత కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు



విడోస్ హోం వ్యవస్థాపకుడు పైండా రామకృష్ణయ్య

బోట్‌క్లబ్: అలనాడు వితంతు మహిళలకు ఉండేందుకు నిలువ నీడ లేని రోజుల్లో ఎందరో సామాజికవేత్తలు, దాతలు చేతనైన సాయం చేసి నీడ చూపి ఆసరా కల్పించేవారు. అలాంటి దాతల్లో పేరెన్నిక గన్నవారు పైండా రామకృష్ణయ్య జమీందారు ఒకరు. స్థానిక మెయిన్ రోడ్డులోని విడోస్ హోమ్‌ను 1898లో ఎంతో ఉన్నత ఆశయంతో దీనిని ఏర్పాటు చేశారు. అప్పట్లో ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు వితంతు వివాహాలను ప్రోత్సహించేవారు. వారి ప్రోత్సాహంతో వివాహం చేసుకున్న వధువులను చాలా మందిని వారి బంధువులు ఇళ్లలోకి రానిచ్చేవారు కాదు. అటువంటి ఎందరికో ఈ విడోస్ హోం ఆనాడు ఆసరా కల్పించింది. కాలం మారింది. క్రమేణా ఈ హోంకు వచ్చేవారి సంఖ్య కూడా తగ్గిపోవడంతో ఈ భవనం బాగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో హోమ్‌ను దేవదాయశాఖ పరిధిలోకి తీసుకొని కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఈ భవనం పూర్తిగా పాడవ్వడంతో 2010లో అక్కడ షాపులు నిర్మించి అద్దెలకు ఇస్తున్నారు. అప్పటి నుంచి ఏటా ఆగస్టు 15, జనవరి 26న సాలిపేట మున్సిపల్ గరల్స్ హైస్కూల్ విద్యార్థినులకు స్వీట్లు, ఉపకార వేతనాలు అందిస్తున్నారు. దాత ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు చేయాలనే దేవదాయశాఖ అధికారుల ఆదేశాలు మేరకు ఆగస్టు 1 నుంచి మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాలు ప్రారంభించారు.

50 మందికి శిక్షణ

ప్రస్తుతం దేవాదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకూ ఉచిత కుట్టుమెషీన్ శిక్షణ ఇస్తున్నారు. మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా అనుభవజ్ఞులైన ఇద్దరిని నియమించారు. మూడు నెలల పాటు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మూడు నెలల్లో జాకెట్లు, డ్రెస్‌లు ఎలా కుట్టాలో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ అనంతరం వారు ఇంటి వద్ద స్వయం ఉపాధి పొందే అవకాశం కల్పిస్తున్నారు.

శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతోంది



కుట్టు శిక్షణ నేర్చుకోవాలని ఎప్పటి నుండో అనుకుంటున్నాను. ఇంటి వద్ద ఖాళీ సమయాల్లో కుట్టుపని చేసుకొంటే కుటుంబానికి చేదోడుగా భావించాను. శిక్షణ ఇవ్వాలంటే డబ్బులు అడిగారు. దీంతో వారికి డబ్బులు ఇవ్వలేక శిక్షణ తీసుకోలేదు. ప్రస్తుతం ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు.

– వెంకటలక్ష్మి

శిక్షణలో ఎంతో నేర్చుకోవచ్చు



నేను గత 10 రోజులుగా కుట్టు శిక్షణ నేర్చుకొంటున్నాను. మూడు నెలలు ఉచితంగా శిక్షణ ఇస్తామని ఇక్కడ నిర్వాహకులు చెప్పారు. ఈ మూడు నెలల్లో అన్ని నేర్చుకొంటే నేనే స్వయంగా దుస్తులు కుట్టి డబ్బులు సంపాదించుకొంటాను. నిరుపేదలైన మాకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది.

– విజయదుర్గ

అలరించిన వీణా కచేరీ



వీణపై కీర్తనలు పలికిస్తున్న ద్విభాష్యం నగేష్‌బాబు తదితరులు

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళా మందిర్‌లో సంగీత ప్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన వీణా కచేరి అలరించింది. ముందుగా సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి సంగీత కచేరీ ప్రారంభించారు. వీణా విద్వాంసుడు ద్విభాష్యం నగేష్‌బాబు వీణపై వాగ్గేకారులు కీర్తనలు పలికించారు. వీరు లలిత రాగంలో 'నీ కరుణ కటాక్షం...' రీతి గౌళ రాగంలో 'నన్ను విడిచి వెళ్లకురా...' తదితర కీర్తనలు పలికించారు. వీరికి మృదంగ విద్వాంసులు కె.యోగేష్, ఘటం విద్వాంసులు ఎస్.హనుమంతరావు సంగీత సహకారం అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్‌కేవీడీ వెంకట్రావు, మునుగంటి వెంకట్రావు, ప్రవంతి కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఎస్.జగదీశ్వరి, జె.చందు హాజరయ్యారు.

శాస్త్రోక్తంగా విశ్వకర్మ యజ్ఞం

కాకినాడ కల్చరల్: స్థానిక ఆనందభారతి మైదానంలో రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ పరిషత్, శ్రీవిరాట్ విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ అర్చక పురోహిత సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న విశ్వకర్మ మహాయజ్ఞం ఆదివారంతో ముగిసింది. చివరి రోజున వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. విశ్వకర్మ సుప్రభాత సేవ, గోపూజ, గణపతి పూజ చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పరిషత్ ప్రధాన కార్యదర్శి కందుకూరి వెంకట సత్యబ్రహ్మాచార్యులు, అరట్లకట్ల రాంబాబు, బి.చంద్రశేఖర్‌శాస్త్రి పాల్గొన్నారు.

లాప్రోస్కోపిక్ విధానంలో కిడ్నీ మార్పిడి

కాకినాడ క్రైం: లాప్రోస్కోపిక్ విధానంలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించినట్లు అపోలో ఆసుపత్రి కాకినాడ యూనిట్ సీఈవో ఐవి రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో వైద్యుల పర్యవేక్షణలో ఈ శస్త్రచికిత్స నిర్వహించామన్నారు. లాప్రోస్కోపిక్ విధానంలో నిర్వహించడం వల్ల దాత శరీరంపై అతి చిన్న గాయం, నొప్పి లేకుండా కిడ్నీని సేకరించి గ్రహీతకు అమర్చామన్నారు. 57 ఏళ్ల మహిళ తన కిడ్నీని కుమారైకు దానం చేసిందని వెల్లడించారు. ఈ వైద్య ప్రక్రియలో డాక్టర్ జీవీ రావు, డాక్టర్ మణికంఠన్, డాక్టర్ కరుణాకర్ రెడ్డి, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ శర్మిష్ఠ, డాక్టర్ తేజోకృష్ణ కీలకంగా వ్యవహరించారని తెలిపారు.

ఉత్సాహంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్



గొడ్డటిపాలెంలో మట్టిని పట్టుకుని ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, అధికారులు

కరప: మండలంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ చురుగ్గా నిర్వహిస్తున్నారు. గొడ్డటిపాలెంలో సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు, కార్యదర్శి హీరాలాల్ రాంజీ, ఉపాధి పథకం, పంచాయతీ, సచివాలయం సిబ్బంది, వలంటీర్లతో కలసి చెరువులవద్ద, పొలంగట్ల వద్ద మట్టిని సేకరించి ర్యాలీ నిర్వహించి, నాభూమి, నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం అంటూ నినాదాలుచేస్తూ ప్రజలను ఉత్తేజ పరచారు. అనంతరం నా భూమి–నా దేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించి, మొక్కను నాటి, ప్రతిజ్ఞ చేయించారు. అరట్లకట్ట, గురజనాపల్లి, కొంగోడు, నడకుదురు గ్రామాల్లో కూడా ఆజాదీ కా అమృత్ హోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

తాటి గారెలు.. తిని తీరాల్సిందే..!

- తాటికాయలో పోషకాలు మెండు
- వర్షాకాల వంటకం తాటి బూరెలు
- రుచికరం, ఆరోగ్యప్రదం



తాటిపండుతో తయారు చేసిన దిబ్బరొట్టెలు



తాటి బూరెలు

పెద్దాపురం: తాటిచెట్టును కల్పవృక్షం అంటారన్న విషయం తెలిసిందే. ఆ చెట్టులో పనికిరాని భాగం అంటూ లేదు. ప్రతి భాగమూ ఎన్నో విధాలుగా ప్రజలకు వినియోగపడుతూనే ఉంటుంది. తాటికాయ విషయానికి వస్తే ముంజెలు, ముగ్గితే పళ్లు, భూమిలో పాతితే మరింత ముదిరాగ బుర్రగుంజు, తరువాత తేగలు ఇలా ఎన్నో రూపాంతరాలై ఎన్నో రుచులు అందిస్తూ ఉంటుంది. తాటి పండు విషయానికి వస్తే కొన్నేళ్ల క్రితం వరకు బాటసారులు తాటి పండుతో కడుపు నింపుకొనేవారు. దానిని కాల్చి గుజ్జు తింటే మరింత రుచికరంగా ఉంటుంది. ఈ గుజ్జుతో తాటి ఇడ్లీలు, బూరెలు, గారెలు, రొట్టె వంటి వంటకాలు పల్లె ప్రాంతాల్లో ఎక్కువగా తయారు చేస్తారు. వర్షాకాలంలో సీజనల్ వంటగా తాటి బూరెలు తినడం పరిపాటి.

ఈ తాటిపండు ఉచితమే

సీజనల్‌గా దొరికే తాటిపండు ఎక్కడైనా ఉచితంగానే దొరకుతుంది. ఈ పండు కనబడితో అవితీసుకోక పోయిన ఒక్కసారి వాసన చూడగల్గితే సహజసిద్ధంగా ఉండే పండు వాసన తెలుస్తుంది. ఇక వీటితో వంటకాలు చేస్తే చుట్టు పక్కల వారికి సువాసన గుప్పుమంటుంది. ఒక్కసారి ఈ వంటకాలు రుచి చూస్తే మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది.

తాటిపండు ఆరోగ్యకరమే



తాటిపండులో ఎన్నోరకాల ఆరోగ్యకరమైన పోషకాలున్నాయి. ఏ, సీ విటమిన్లతో పాటు బీ కాంప్లెక్స్ పుష్కలంగా లభిస్తుంది. ఎక్కువ పీచుపదార్థం కావడంతో జీర్ణకోశ వ్యాధులు, మలబద్ధకం దూరం అవుతాయి. అంతేగాక రక్తాన్ని శుద్ధి చేసి మెదడుకు గ్లూకోజ్‌ను అందిస్తుంది.

– డాక్టర్ ఎస్.సుదీప్తి, పీపీ యూనిట్ వైద్యులు, పెద్దాపురం

సత్కళలో దేశభక్తి గీతాల పోటీలు




దేశభక్తి గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. సుమారు 150 మంది విద్యార్థులు పోటీలో పాల్గొని దేశభక్తి గీతాలు ఆలపించారు. అలాగే వాద్య పరికరాలపై దేశభక్తి గీతాలు పలికించారు. విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించేందుకు పోటీలు నిర్వహించామని, వీరికి ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవంలో బహుమతులు ప్రదానం చేస్తామని సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసుడు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు అన్నారు. ఈకార్యక్రమంలో శిరిష, భాస్కర రామం, కృష్ణ, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరాలమ్మ వ్రతాలకు సన్నద్ధం

- 18 నుంచి సామూహిక వ్రతాలు
- పూజా సామగ్రి సమకూర్చనున్న దాతలు
- దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం



బాలత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయం

కోనేటి పనుల్లో జాప్యం

సామర్లకోట: ఏడాదికో మాసం.. ఆ మాసంలో నాలుగు వారాలు.. మహిళలు మంగళకరంగా తయారై అమ్మవారి స్వరూపాలుగా అలంకరించుకుని ఇంటికో వరలక్ష్మి నడయాడే రోజు. అదే శ్రావణ శుక్రవారం. మహాలక్ష్మికి ప్రీతిపాత్రమైనది.. ఐదో తనాన్ని నిలబెట్టుకునే వరాన్నివ్వమని అమ్మవారిని ప్రతి హిందూ స్త్రీ మనసా వాచా కర్మేణ వరలక్ష్మీ దేవి వ్రతమాచరించే రోజది. అనుకోని అవాంతరాలు ఏర్పడి కొన్ని ఇళ్లలో ఈ వ్రతం ఆచరించడానికి కొన్నిసార్లు కుదరదు. ఇటువంటి వారికోసం పలు ప్రముఖ ఆలయాల్లో ఈ వ్రతాలను సామూహికంగా నిర్వహించడం పరిపాటి. ఇందులో భాగంగా స్థానిక పంచారామ క్షేత్రమైన బాలత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారాల్లో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించడానికి నిర్ణయించారు. ఈ నెల 18, 25, సెప్టెంబరు 1, సెప్టెంబరు 8వ తేదీల్లో వచ్చే శుక్రవారాల్లో సామూహిక వ్రతాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

దాతల సహకారంతో సామగ్రి..

వరలక్ష్మి వ్రతాలకు కావలసిన పూజా సామగ్రిని ఏటా దాతలు సమకూరుస్తుంటారు. ఈ ఏడాదీ దాతల నుంచే సమకూర్చడానికి ట్రస్ట్ బోర్డు ఇటీవల సమావేశంలో నిర్ణయించింది. వ్రతాలకు వచ్చే మహిళలు కొబ్బరికాయ, కేజీన్నర బియ్యం, కలశ పాత్ర, జాకెట్టుగుడ్డ మాత్రమే తీసుకు రావలసి ఉంటుంది.

ఆలయ కోనేటి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. గ్రావెల్ వేసి వదలి వేశారు. దానిపై ఇసుక వేయావలసి ఉంది. దీనిపై పురావస్తుశాఖ అధికారులను వివరణ కొరగా మరో 15 రోజుల్లో ఇసుక పనులు పూర్తి చేస్తామని చెప్పారు. దాంతో మొదటి శుక్రవారం నాటికి పనులు పూర్తి అయ్యే అవకాశం లేదు.



అసంపూర్తిగా ఉన్న పంచారామ క్షేత్ర కోనేరు పనులు

పేర్లు నమోదు చేసుకోవాలి



సామూహిక వ్రతాలకు వచ్చే భక్తులు ముందుగా తమ పేర్లను ఆలయంలో నమోదు చేయించుకోవాలి. ప్రతి శుక్రవారం 9.15 నిమిషాలకు సామూహిక వ్రతాలు ప్రారంభమవుతాయి. మహిళలు సకాలంలో హాజరు కావాలని తీర్మానించాం. భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేస్తాం.

– మట్టపల్లి రమేష్‌బాబు, ట్రస్టు బోర్డు చైర్మన్, సామర్లకోట

అర్చకుల ఏర్పాటు..



పంచారామ క్షేత్రంలో సామూహిక వ్రతాలు నిర్వహించే పురోహితులకు దేవస్థానం నుంచి రుసుం చెల్లిస్తాం. వ్రతాలు చేయించుకునే భక్తులను సంప్రదాయబద్ధంగా చీరలు ధరించి రావాలి. భక్తుల సంఖ్యను బట్టి మొదటి అంతస్తుతో పాటు కింద ప్రాకారంలోను సామూహిక వ్రతాలకు పురోహితుల మంత్రాలు వినిపించేలా ఏర్పాట్లు చేస్తాం.

– డి.నాగమల్లేశ్వరరావు, పంచారామ క్షేత్ర ఈఓ, సామర్లకోట

పద్మానగర్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక



కాలనీ అభివృద్ధి కోసం ప్రతిజ్ఞ చేస్తున్న కార్యవర్గ సభ్యులు

కాకినాడ రూరల్: కాకినాడ ఒకటో డివిజన్‌లోని పద్మానగర్ కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నందిబాబు, గౌరవ అధ్యక్షుడుగా కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా వీరేష్‌కుమార్, కార్యదర్శిగా ఆచార్యులు, సంయుక్త కార్యదర్శిగా మోదకొండల శర్మ, కోశాధికారిగా నాగేష్‌కుమార్ ఎన్నికయ్యారు. సలహాదారుగా ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులుగా సుజిత్, అజీజ్, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, శివప్రసాద్, వెంకట్రాజు తదితరులను ఎన్నికున్నారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధితో పాటు సామాజిక సేవా కార్యక్రమాలల్లో చురుగ్గా పాల్గొని, ఐక్యంగా ముందుకు సాగుతామని కార్యవర్గం పేర్కొంది.

ఇగ్నైటెడ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న సంస్థ డైరెక్టర్ గౌతమ్, చిన్నారులు

కాకినాడ కల్చరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇగ్నైటెడ్ హెల్పింగ్ మైండ్స్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 77 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ నాగమల్లితోట జంక్షన్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి భానుగుడి సెంటర్ వరకు సాగింది. అనంతరం మాజీ సైనికులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ అసోసియేషన్ చైర్మన్ వైడీ రామారావు, సంస్థ డైరెక్టర్ గౌతమ్, బాషా, శివ, సలీం, మహేష్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటిపై జాతీయ జెండా ఎగరేద్దాం

బోట్‌క్లబ్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు చిట్నీడి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక ఎల్‌బీ నగర్‌లో జాతీయ జెండాలు పంపిణీ చేశారు. దేశ భక్తిని చాటేలా ప్రతి ఒక్కరూ జాతీయ పతాకాన్ని ఇళ్లపై ఆవిష్కరించాలన్నారు. భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలు భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రంభాల వేంకటేశ్వరరావు, గౌతు చిన్నా పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా నండూరి



నండూరి సత్తిబాబు

కాకినాడ రూరల్: భారతీయ జనతా పార్టీ రూరల్ మండల అధ్యక్షుడిగా పండూరు గ్రామానికి చెందిన నండూరి సత్తిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఆదివారం రాత్రి ఆయన విలేకరులకు తెలియజేశారు. కొత్తగా బీజేపీ మండల అధ్యక్షుడిగా నియమితులైన సత్తిబాబును రామ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రంభాల వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు పితాని లీలావతి, కవికొండల భీమశేఖర్, అనపర్తి వెంకటేష్, పెండెం సత్యనారాయణ, బొలిశెట్టి రామకృష్ణ, చిన్నప్పాజీ, ఘంటసాల గోవిందరాజు తదితరులు అభినందించారు.

జనావళి వృద్ధాశ్రమానికి వితరణ



వృద్ధాశ్రమానికి వస్తువులు అందజేస్తున్న హరీష్ సంస్థ ప్రతినిధులు

కరప: మండలం నడకుదురులోని జనావళి వృద్ధుల అనాథాశ్రమానికి ఆదివారం కాకినాడలోని హరీష్ చారిటబుల్ ఆర్గనైజేషన్ దుస్తులు, సామగ్రి, ఫ్యాన్లు అందజేసింది. సంస్థ ప్రతినిధులు పెనిశెట్టి సురేష్, వరదా దొరబాబు తదితరులు ఆశ్రమానికి వచ్చి వీటిని అందజేశారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు మందపల్లి శ్యామ్ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

త్రిపుల్ ఐటీకి రోషన్‌బాబు



సామర్లకోట: త్రిపుల్ ఐటీ రెండో విడతలో స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆదివారం రాత్రి పాఠశాల హెచ్‌ఎం యు.సత్యనారాయణ స్థానిక విలేకర్లకు వివరాలు తెలిపారు. ఎం.ప్రదీప్ రోషన్‌బాబుకు శ్రీకాకుళంలో త్రిపుల్ ఐటీకి సీటు వచ్చిందన్నారు. దాంతో తమ పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తీర్ణులైన ముగ్గురు విద్యార్థులకు త్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయని తెలిపారు.